ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలికల క్రికెట్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిపురం జెడ్‌పిహెచ్‌ఎస్ క్రికెట్ గ్రౌండ్‌లో స్కూల్ గేమ్స్ అండర్-17 బాలబాలికల క్రికెట్ జట్టును ఎంపిక చేసినట్లు అన్నమయ్య జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వసంత తెలిపారు. ఈ ఎంపికకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నలుమూలల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొనగా, ఇందులో 190 మంది బాలురు విభాగంలో, 60 మంది బాలికల విభాగంలో పాల్గొన్నారు. వీరిలో బాలుర జట్టుకు 40 మంది, బాలికల జట్టుకు 24 మందిని గుర్తించి ప్రాబబుల్స్‌కు ఎంపిక చేసి వారికి మూడు రోజులు పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ఇక్కడ ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను జట్టుకు ఎంపిక చేసి పోటీలకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో మౌళి, శ్రీధర్, నరేష్, రియాజ్, రమేష్, ఉమా, యోగేష్, ఉదయ్, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

క్రికెట్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో అధికారులు

పెండింగ్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలను తిరస్కరించండి
- వైసిపి, టిడిపి, జనసేన దొందూదొందే
- మదనపల్లె బహిరంగ సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్

మదనపల్లె : ప్రజా రక్షణభేరి సభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ. గఫూర్

ప్రజాశక్తి-కడప ప్రతినిధి/మదనపల్లె అర్బన్/ములకలచెరువు

పెండింగ్‌లో ఉన్న సాగు నీటి ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ అన్నారు. శుక్రవారం అన్నమయ్య జిల్లాలోని ములకలచెరువు, మదనపల్లెలో లౌకిక వాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని రాష్ట్ర అభివృద్ధి పేరుతో సిపిఎం రాష్ట్ర కమిటీ చేపట్టిన ప్రజారక్షణ భేరీ బహిరంగ సభ సిపిఎం సీనియర్ నాయకులు హరీంద్రనాథ్ శర్మ అధ్యక్షతన నిర్వహించారు. ములకలచెరువు నుండి మదనపల్లెకి చేరుకున్న బస్సు యాత్రకు స్థానిక అన్నమయ్య సర్కిల్‌లో ద్విచక్ర వాహనాలు, ఆటోల భారీ ర్యాలీని స్థానిక చిత్తూరు బస్టాండ్ సభ ప్రాంగణం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కరువు విలయతాండం చేస్తుంటే ప్రభుత్వాలకు పట్టడం లేదన్నారు. ఫలితంగా వేలాదిమంది నగరాలకు వలసలు పోతున్నారన్నారు రాజకీయంగా విపక్షాలను, ప్రజా సంఘాలను ఎక్కడికక్కడ జగన్ ప్రభుత్వం నిర్బంధించడం అణచివేయడం వంటి కక్షసాధింపులు చేపట్టడం దారుణమన్నారు బడా పారిశ్రామిక వేత్తలకు వేలాది ఎకరాలు భూమిని కట్టబెడుతున్న ప్రభుత్వం పేదలు చిన్న గుడిసెలు వేసుకుంటే వాటిని కూడా నిర్ధాక్షిణ్యంగా కూల్చి వేస్తోందని చెప్పారు. కేవలం బటన్ నొక్కి కేటాయించిన నిధులు తక్కువని ప్రచారం మాత్రం ఎక్కువని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి మైనార్టీల, దళితుల పట్ల దాడులు చేస్తోందన్నారు. కార్పొరేటర్లకు కొమ్ము కాస్తూ లక్షలాది కోట్లు రాయితీగా ప్రకటిస్తున్న కేంద్రం కార్మికులకు, కర్షకులకు చేసింది ఏమీ లేదన్నారు.

మదనపల్లె : హాజరైన ప్రజలు, సిపిఎం నాయకులు

రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులు
- సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి

రాష్ట్రంలో 679 మండలాలు ఉంటే అందులో 300 పైగా మండలాల్లో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు కరువు పరిస్థితులు ఉన్నాయనిసిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. 300 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులు, వ్యవసాయ కార్మికులు, ఇతర చిన్నచిన్న వృత్తిదారులుకు ప్రభుత్వం ఆదుకోవాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులు లేవు, చదువుకున్నామంటే సరైన విద్య వసతి లేదని తెలిపారు. పనిచేసే బతుకుదాం అంటే సరైన పరిశ్రమలు లేవన్నారు. అత్యంత వెనుకబడ్డ ప్రాంతాన్ని ఆదుకుంటా ఉద్ధరిస్తామని బిజెపి రాయలసీమ డిక్లరేషన్ ఇచ్చిందని తెలిపారు. బిజెపి ఇచ్చిన డిక్లరేషన్‌లో రాష్ట్రానికి ప్రత్యేకమైన నిధులు కేటాయిస్తామని వెనుకబడ్డ రాయలసీమ ఉత్తరాంధ్రలో వ్యాపార, ఉపాధి కోసం పరిశ్రమలు పెడతామన్నారు.

ఆకాశాన్నంటిన నిత్యావసర ధరలు
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఉమామహేశ్వరావు

నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, డీజల్, పెట్రోలు, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచేశారనిసిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఉమామహేశ్వరావు తెలిపారు. వైసిపి కానీ, టిడిపి కానీ ఖండించడం లేదన్నారు. రాష్ట్రంలో హంద్రీనీవా, నగరి, గాలేరు, తెలుగు గంగ, పోలవరం తదితర ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. కడప ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయలేదన్నారు. బిజెపికి ప్రత్యామ్నాయంగా కలిసొచ్చే బావ సారూప్య పార్టీలను కలుపుకుని వేదికను ఏర్పాటు చేయడం కోసమే ఈ నెల 15న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఆ బహిరంగ సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

సిపిఎం రాష్ట్ర నాయకులు నాగశివరాణి మాట్లాడుతూ దేశంలో గ్యాస్, ఆర్టీసీ, విద్యుత్ ఛార్జీల ధరలు పెరుగుతున్నాయని, అదేతీరున ఉపాధి హామీ ధరలు పెరగడం లేదని చెప్పారు. ఏటా ఉపాధి హామీ నిదుల కేటాయింపుల్లో కోత పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కడపలో ఉక్కు పరిశ్రమను, కర్నూలులో హైకోర్టు, తిరుపతిలో యునివర్సిటీ ఏర్పాటు చేస్తామన్న హామీలేమయ్యాయని ఎద్దేవా చేశారు. సిపిఎం రాష్ట్ర నాయకులు రమాదేవి మాట్లాడుతూ రాష్టంలోని పెండింగ్ ప్రాజెక్టులు సత్వరమే పూర్తిచేయాలని, భవన నిర్మాణ కార్మిక బోర్డు ద్వారా భద్రత కల్పించాలని, ఆటో కార్మికులకు భారాలను తొలగించాలని డిమాండ్ చేశారు. అసంఘటిత కార్మికులకు బోర్డు, పెన్షన్ సదుపాయాలు కల్పించాలన్నారు. కేంద్రం కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించి కార్మికులకు ఉరి తాడు బిగిస్తోందని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఖనిజాలకు, ఉద్యాన పంటలకు నిలయమని, ఇటువంటి ప్రాంతంలో వ్యవసాయాధారిత పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు కృష్ణయ్య, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కరయ్య,, జిల్లా నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రామాంజులు, వెంకటరామయ్య, చిట్వేలి రవికుమార్, డిసి.వెంకటయ్య, నరసింహ, ప్రజలు, రైతులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

మదనపల్లె పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

కళాజాతా నిర్వహిస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు

సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం : కలెక్టర్

అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కలికిరి

ఏళ్ల తరబడి పరిష్కారం కాని ఎన్నో సమస్యలకు మండల స్థాయి స్పందన పరిష్కారం చూపించిందని కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో కలెక్టర్ అధ్యక్షతన మండల స్థాయి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ద్వారా ఇప్పటికే అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం లబ్ధి అందిస్తోందన్నారు. సచివాలయాల ద్వారా 80 శాతానికి పైగా సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలిపారు. గ్రామ స్థాయిలో చిన్న చిన్న అంశాలు ఏవైనా జిల్లా అధికారుల దృష్టికి రానివి జిల్లా కేంద్రానికి రాలేని వారి కొరకు మండల స్థాయిలోనే జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2020 సంవత్సరంలో గ్రామాలలో నీటి ఎద్దడి నివారణకు గాను ట్యాంకర్లతో నీళ్లు తోలిన వారి బిల్లులు మంజూరు కాలేదని పలు అర్జీలు కలెక్టర్‌కు రాగా, మిగిలిన అర్జీలు రెవెన్యూ సమస్యలపై వచ్చినట్లు వారు తెలిపారు. ఈ సమస్యలు సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులు ఆదేశించినట్లు తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజలందరూ తమ సమస్యలు పరిష్కరించుకోవడానికి మంచి అవకాశమని, ఇలాంటి కార్యక్రమాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, మదనపల్లె ఆర్‌డిఒ మురళి, మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, అన్నమయ్య జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్, ఎంపిపి వేంపల్లి నూర్జహాన్, జడ్‌పిటిసి పద్మజ, ఎంపిడిఒ గంగయ్య, తహశీల్దార్ భాగ్యలత, జిల్లాలోని అన్ని శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది, రాజకీయ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం పూర్తి చేయాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేట్ పరం చేయొద్దని ఈ నెల 8న నిర్వహించే విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎస్.నరసింహ, పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి పి.కోటేశ్వరరావు, ఎఐఎస్‌ఎ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.లవకుమార్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ పిలుపునిచ్చారు. బంద్‌కు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపట్టాలని దశాబ్దాలుగా జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు జరుగుతున్న, ప్రభుత్వాలు మాత్రం శిలాఫలకాలకే పరిమితం అయ్యాయన్నారు. బ్రాహ్మణి ఉక్కు పరిశ్రమ పేరుతో భారీ పరిశ్రమకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వం, తరువాత వచ్చిన ప్రభుత్వాలు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని శంకుస్థానలు, నిర్మాణం పూర్తి చేస్తామని హామీలు మాత్రం ఇస్తూ వస్తున్నాయని పేర్కొన్నారు. చివరికి తక్కువ సామర్థ్యంతో పరిశ్రమను పూర్తి చేసేందుకు ఇప్పటి ప్రభుత్వం శంకస్తాపన చేసిందన్నారు. డిగ్రీలు, ఇంజినీరింగ్, ఎంబిఎ, ఎంసిఎ చదువుకున్న యువత బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్‌కు వలస వెళుతున్నారని తెలిపారు. ఇక్కడ నిర్మాణ దశలో ఆగిపోయిన గతంలోని భారీ పరిశ్రమ పూర్తతే అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్నారు. ఇప్పటికే నీళ్లులేక వర్షాలు లేక కరువుతో ఉన్న ఈ ప్రాంతం కడప ఉక్కు పరిశ్రమ వస్తే భారీగా అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులకు ఇక్కడే వేలాది మందికి ఉపాది దొరుకుతుందని పేర్కొన్నారు. దీని కోసం విద్యార్థులు, యువకులు కలిసి నవంబర్ 8న జరిగే బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చరు. రాష్ట్రానికే తలమానికంగా ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేట్ పరం చేయడానికి కేంద్ర సిద్ధపండిదని ఛత్తీస్‌ఘడ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయని కేంద్ర బిజెపి నాయకత్వం అక్కడ దొరికే ఇనుప ఖనిజంతో ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలో నిర్మిస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిందన్నారు. ఇదంతా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజకీయాల కోసం కార్పొరేట్ వ్యక్తుల కోసం విశాఖ ఉక్కును బలి చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిని తిప్పి కొట్టేందుకు రాష్ట్ర వ్యాప్త బంద్‌ను జయప్రదం చేయని కోరారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి, యువజన సంఘం జిల్లా నాయకులు, వినోద్, హేమంత్, ఖాదర్ బాషా, షరీఫ్, వెంకటేశ్వరరెడ్డి, నిత్య, సురేష్ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎస్.నరసింహ, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారి కె.వినయ్, పిలుపునిచ్చారు. బంద్‌కు సంబంధించిన పోస్టర్లను బిటి.కళాశాలలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘం నాయకులు కమలాకర్, కార్తీక్, ముఖేష్, నరసింహులు, హరి, భరత్, రెడ్డిరాణి, శ్రావని, తేజస్విని, రాజ్ కుమార్, పావని, విశ్వ పాల్గొన్నారు.

ఆరోగ్య కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యం అనే ఆలోచనతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే నవాజ్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం 13వ వార్డు పరిధిలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జగనన్న సురక్ష కార్యక్రమం వార్డు కౌన్సిలర్ ఎస్.ఫర్జనా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరి బాగోగులను తెలుసుకొని ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేశారని గుర్తుచేశారు. సంక్షేమ పథకాలను అమలు చేయటంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రగానిగా ఉందన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న వాటి పరిష్కారానికి ప్రజల వెంటే తాము ఉంటామని చెప్పారు. అనంతరం రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జింక వెంకటా చలపతి, 14వ వార్డు కౌన్సిలర్ షేక్ షబానా, కౌన్సిలర్లు పాల్ చంద్రశేఖర్, వెంకట శివారెడ్డి, శ్రీనివాసులు, ఈశ్వర్ నాయక్, నాయకులు రఫీక్ అహ్మద్, వెలుగు చంద్ర, ఇర్ఫాన్‌ఖాన్, మునిసిపల్ కమిషనర్ ప్రమీల, డిఇ శిరీషా, వైద్యులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్థిక పరిస్థితిపై 'బుగ్గన' వ్యాఖ్యలు సిగ్గుచేటు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని స్వయంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రప్రసాద్ పేర్కొనడం సిగ్గుచేటని, అది ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని జనసేన పార్టీ రాజంపేట అసెంబ్లీ ఇంచార్జి మలిశెట్టి వెంకటరమణ అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని ఉద్యోగులు జీతాల విషయంలో సంయమనం పాటించాలని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజన్న ప్రసాద్ ఇచ్చిన ప్రకటనపై శుక్రవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో మలిశెట్టి వెంకటరమణ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు రూ.1.15 వేల కోట్లు అప్పు చేస్తే రాష్ట్రాన్ని అమ్మివేశారని గొంతు చించుకున్న వైసిపి నేడు రూ.10 లక్షల కోట్లు రాష్ట్రంపై అప్పుల భారాన్ని మోపి ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని స్థితికి వైసిపి ప్రభుత్వం దిగజారిపోయిందని పేర్కొన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఏ ఒక్క మాసం కూడా ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్లు సక్రమంగా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర చేనేత కార్యదర్శి రాటాల రామయ్య, నాయకులు భాస్కర్ పంతులు, ఆచారి, గోపి, చౌడయ్య, కిషోర్, సుబ్బయ్య, జనసేన వీర మహిళ శిరీష పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మలిశెట్టి వెంకటరమణ

సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ఓటర్ల జాబితా పరిశీలనకు ప్రత్యేక శిబిరాలు : జెసి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 4, 5వ తేదీలలో ఓటర్ల జాబితా పరిశీలనకు ప్రతి పోలింగ్ స్టేషన్లో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ రాజకీయ పార్టీ ప్రతినిధులకు తెలిపారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్లోని తన చాంబర్లో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ గిరీష ఆదేశాల మేరకు రెండు రోజులపాటు ప్రతి పోలింగ్ స్టేషన్లో ఓటర్ జాబితాతో బిఎల్‌ఒలు ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నారని తెలిపారు. రాజకీయ పార్టీలు కూడా తమ పార్టీల తరపున బిఎల్‌ఎలను ప్రతి పోలీస్ స్టేషన్లో ఉంచాలని కోరారు. బిఎల్‌ఎ, బిఎల్‌ఒలు సమన్వయం చేసుకొని పోలింగ్ స్టేషన్కు తమ ఓట్లను పరిశీలించుకోవడానికి వచ్చిన ప్రజలకు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. తప్పులు లేని స్వచ్ఛమైన ఓటర్ జాబితా రూపకల్పనకు ఈ ప్రత్యేక శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని ఈ విషయాన్ని ప్రజలకు వివరించాల్సిందిగా రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నవంబర్ 7, 8వ తేదీలలో ఈవిఎంలకు మొదటి దశ పరిశీలనలో భాగంగా మాక్ పోలింగ్ జరుగుతుందని రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలలో రాజకీయ పార్టీ ప్రతినిధుల సందేహాలకు జాయింట్ కలెక్టరు సమాధానాలు ఇచ్చారు. సమావేశంలో అన్ని నియోజకవర్గాల ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారులు, వైసిపి, టిడిపి, జనసేన, సిపిఐ, బిఎస్‌పి పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు

- మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లాను రద్దు చేస్తారంటూ టిడిపి నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా అన్నారు. జిల్లాల పునర్విభజన మళ్లీ జరుగుతుందన్న వార్తలు సామాజిక మాధ్యమాలలో చేస్తున్న ప్రచారం పూర్తి నిరాధారణమైనవన్నారు. టిడిపి నాయకులు వారి సోషియల్ మీడియా ద్వారా చేస్తున్న వాటిని ఎవరు నమ్మవద్దన్నారు. కొంతమంది ప్రభుత్వానికి వ్యతిరేకంగానూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. జిల్లాల పునర్విభజన ప్రచారంలో ఒక్క శాతం కూడా నిజం కాదన్నారు. రాయచోటిలో జిల్లా కేంద్రం ఉండకూడదని కొంతమంది దురుద్దేశ్యంతో విష ప్రచారం చేస్తున్నారన్నారు. టిడిపి నాయకులు ప్రాంతాలు ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నం చేస్తోంది. రానున్న ఎన్నికల్లో అన్నమయ్య జిల్లాలో ఒక్క సీటు కూడా గెలవలేమన్నా భయంతో జిల్లాల విభజన జరుగుతోందని ప్రజలను తప్పుదారి పట్టించే దుర్మార్గం ఆలోచనకు ఒడిగట్టారన్నారు. ఈ క్రమంలోనే టిడిపి నాయకులు జిల్లా పార్టీ కార్యాలయాన్ని మదనపల్లిలో ఏర్పాటు చేశారని విమర్శించారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి ఒక్కసారి తీసుకొన్న నిర్ణయాన్ని, ఇచ్చిన హామీని తప్పకుండా అమలు చేసి తీరుతారన్నారు. ఊపిరి ఉన్నంత వరకు రాయచోటి జిల్లా కేంద్రంగానే ఉంటుందని, ఇక్కడి నుంచి ఒక్క అడుగు కూడా దాటిపోకుండా చేస్తామని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి హామీ ఇచ్చారని చెప్పారు.

అండర్ బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీ, ప్రభుత్వ విప్

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలోని బుడుగుంటపల్లి, అయ్యవారిపల్లి మీదుగా కోడూరుకు వచ్చే రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మానానికి రూ.10.60 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులకు శుక్రవారం రాజంపేట పార్లమెంట్ సభ్యులు పి.వి.మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణంతో 26 గ్రామాల ప్రజలకు వాహనాల రాకపోకులకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. దశాబ్దాలకాలంగా అండర్ బ్రిడ్జి నిర్మాణం కలగానే మిగిలిందన్నారు. ఈ కల సహకారం కాబోతోందని తెలిపారు. కార్యక్రమంలో ఐఆర్‌ఎస్ కో-ఆర్డినేటర్ అక్కిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎం.హేమనవర్మ, జడ్‌పిటిసి రత్నమ్మ, వైసిపి సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, ఒజి శ్రీనివాసులురెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, సర్పంచి శివయ్య, ఉప సర్పంచ్ తోట శివసాయి, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రశాంతి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, సాయి కిషోర్‌రెడ్డి, న్యాయవాది సురేష్, సర్పంచ్ దార్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు

ప్రజాశక్తి-రాయచోటి

రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలకు సూచించారు. శుక్రవారం నిర్వహించిన విసిలో కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ గిరీష, ఎస్‌పి కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ, డిఆర్‌ఒ సత్యనారాయణ, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీష మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పకడ్బందీ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నూతన జిల్లాలో మొదటిసారిగా నిర్వహించే ఎన్నికలలో ఎటువంటి చిన్న పొరపాటు జరగకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని అధికారులకు సూచించారు. ఓటరు జాబితాకు సంబంధించి ఎటువంటి విమర్శలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలను ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకొని విజయవంతం చేయాలన్నారు.



ఉచిత మెగా వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా నేతృత్వంలో శుక్రవారం పట్టణంలోని మోతీనగర్ పరిధిలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. అమ్మ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో షాజహాన్ బాషా పర్యవేక్షణలో, నాగూర్ వలి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు గుండె జబ్బులు, బిపి, షుగర్, థైరాయిడ్ దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న ప్రజలకు ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం.సి.సందీప్, డాక్టర్ ఇ.అంకితారెడ్డి, డాక్టర్ ఇ.జాన్‌ఇసాక్, డాక్టర్ మనోహర్ కుమార్, డాక్టర్ లావణ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం నుండి సాయంత్రం వరకు డాక్టర్లు అందుబాటులో ఉండి ప్రజలకు అన్ని రకాల పరీక్షలు నిర్వహిం చారన్నారు. ప్రస్తుతం ప్రజలు వారికి తెలియకుండానే అనేక జబ్బులు బారిన పడుతున్నారని, వైద్య శిబిరాల వల్ల వ్యాధుల పట్ల అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో జూనైద్ అక్బరీ, నాదెండ్ల విద్యాసాగర్, బాలు స్వామి, గంగారపు నవీన్ చౌదరి, మస్తాన్, నాగూర్ వలి, బాలమణి శేఖర్, గిరీష్ కుమార్ పాల్గొన్నారు.

పర్యావరణ అభివృద్ధికి ప్రత్యేక కృషి

ప్రజాశక్తి-పీలేరు

జిల్లాలో పర్యావరణ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు జిల్లా పర్యాటక అధికారి నాగభూషణం తెలిపారు. శుక్రవారం పీలేరులో పర్యావరణ అభివృద్ధి కోసం నిర్మించ తలపెట్టిన దుకాణాల కోసం అవసరమైన స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పర్యావరణ అభివృద్ధికి ఉన్న అవకాశాలను అధ్యయనం చేస్తున్నామన్నారు. దానికి అవసరమైన ప్రతిపాదనలను కూడా సిద్ధం చేసుకుని ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని చెప్పారు. అందులో భాగంగా పీలేరు-తిరుపతి రోడ్డులో కొన్ని నిర్మాణాలు చేపట్టడం కోసం స్థల పరిశీలన చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పర్యావరణ శాఖ డైరెక్టర్ షేక్ షాకీర్, సర్వేయర్ ప్రబంధ, విఆర్‌ఒ ఎర్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై వాలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు కలుగుతాయని బి.కొత్తకోట తహశీల్దార్ రఫీ మహమ్మద్ పేర్కొన్నారు. పట్టణంలోని సింహంవీధి సచివాలయంలో ప్రజలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు పూర్తయిన తర్వాత వివాహాలు చేయాలన్నారు. పిల్లలకు నిర్దేశిత వయస్సు రాకుండానే వివాహాలు చేయడం ద్వారా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటారని చెప్పారు. పాఠశాలలో చదివే చాలామంది విద్యా ర్థినిలు వారి వివాహాల కోసమే మధ్యలోనే చదువు నిలిపివేస్తున్నారన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు.బాల్య వివాహాల నిర్మూలనకు తల్లిదండ్రులతోపాటు సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విఆర్ఒ హైదర్, వివిధశాఖల అధికారులు సిబ్బంది, సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు పాల్గొన్నారు.

జిల్లా సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నవంబర్ 5న మదనపల్లిలో జరిగే జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కోరారు.సదస్సు విజయవంతం కోసం శుక్రవారం బి.కొత్తకోటలో బజారు హమాలీలు, సివిల్ సప్లయ్స్ హమాలీలతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ కార్మిక,రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా,ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27,28 తేదీల్లో విజయవాడలతో తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కోరుతూ ఈనెల 5వ తేదీన మదనపల్లిలో జిల్లా సన్నాహక సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

టపాసుల విక్రయాలకు లైసెన్స్ తప్పనిసరి

ప్రజాశక్తి-కలకడ

మాట్లాడుతున్న ఎస్ఐ తిప్పేస్వామి

టపాసులు విక్రయించే వారికి లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలని ఎస్ఐ తిప్పే స్వామి సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన కలకడ పోలీస్‌స్టేషన్‌లో లైసెన్సులు కలిగిన టపా కాయల విక్రయించే యజమానులతో సమా వేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టపాసులు విక్రరించాలంటే తప్పని సరిగా లైసెన్సులు కలిగి ఉన్న వారు మాత్రమే విక్రయించాలన్నారు. లైసెన్స్ లేకుండా టపాసాలను విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టపా సులను ఎక్కడ పడితే అక్కడ విక్రయించరాదని టపాకాయల విక్రయాలకు కేటా యించిన ప్రదేశంలో మాత్రమే అమ్మాలని సూచించారు. లైసెన్సులు కలిగిన వారు బినామీల పేర్లతో టపాకాయలు విక్రయించినచో వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో విక్రయదారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న స్వీట్ వ్యాపారి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఎస్ఐ సమక్షంలో నగదును మహిళకు అందిస్తున్న ఓంకుమార్

స్థానిక పట్టణంలోని వేంపల్లి రోడ్డు స్వీట్ బేకరీ వద్ద తనకు దొరికిన రూ.50 వేలు నగదును పోలీసుల సమక్షంలో బాధితురాలికి అందించి నిజాయితీని నిరూపించు కున్నాడు స్వీట్ వ్యాపారి ఓంకుమార్. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పందిళ్ళపల్లి గ్రామం కుప్పం వాండ్లపల్లి చెందిన కుప్పం కాంతమ్మ లక్కిరెడ్డిపల్లి బ్యాంకులో డ్వాక్రా డబ్బులు రూ.50వేలు రూపాయలు విత్ డ్రా చేసుకుని వేంపల్లి రోడ్ స్వీట్ షాప్‌లో స్వీట్స్ కొనుగోలు చేసి రూ.50వేలు పోగొట్టుకున్నారని చెప్పారు. ఆ దారిన వెళుతున్న ఓంకుమార్ ఆ డబ్బులు దొరకగా ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సమక్షంలో రూ.50వేలు బాధితురాలు కాంతమ్మకు అందజేసి నిజాయితీని నిరూపించుకున్నారని అభినందించారు. ఏవైనా విలువైన వస్తువులు డబ్బులు పోగొట్టుకున్న వారికి అందజేసి ఉత్తమ పౌరులుగా మెలగాలని తెలిపారు.

డికెటి భూముల్లో నిర్మాణాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-పీలేరు

అక్రమ నిర్మాణాలు జరుగుతున్న స్థలం

వ్యవసాయం చేసుకోవడానికి మాత్రమే డికెటి భూములను వినియోగించాలని, అందులో అక్రమ నిర్మాణాలు చేపట్టడం చట్ట వ్యతిరేకమని పీలేరు తహశీల్దారు ధనుంజయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణాలు కొనసాగిస్తే వారికి ఇచ్చిన డీకెటి పట్టాలు రద్దు చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం తహశీల్దారు మాట్లాడుతూ పీలేరు మండలంలో పలుచోట్ల డికెటి భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు ఇటీవల తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై పరిశీలించి పీలేరు ఎంవిఐ కార్యాలయం వెనుక వైపు అక్రమ ఇంటి నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించామన్నారు. తమ సిబ్బందిచే అక్రమ ఇంటి నిర్మాణాలను పరిశీలించి వెంటనే ఆపేయాలని చెప్పాల్సిందిగా తమ సిబ్బందిని ఆదేశించినట్లు చెప్పారు. బోడుమల్లువారిపల్లె రెవెన్యూ గ్రామ సర్వేనెంబర్ 652/17లో 81 సెంట్ల భూమిని షేక్ హసీనా పేరున డికెటి పట్టా మంజూరు చేసి ఉన్నట్లు రెవిన్యూ రికార్డులు ఉన్నాయన్నారు. ఇటీవల ఆ భూమిలో అక్రమ ఇంటి నిర్మాణాలు చేపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. డిటి విజయ్, విఆర్ఒ కవిత, సర్వేయర్ అల్ఫియాలను ఆదేశించి అక్రమ నిర్మాణాలను ఆపివేయించినట్లు తెలిపారు. డికెటి భూములలో నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డికెటి భూములలో వ్యవసాయం మాత్రమే సాగు చేసుకోవాలని సూచించారు. క్రయ, విక్రయాలు జరిపితే అలాంటివి చట్టపరంగా చెల్లవని, ఆర్థికంగా నష్టపోతారని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలని అన్నారు.

In the court of the Addl. Junior Civil Judge, Kadiri
O.S.No:48/2022

Between:
Korra Gurumurthy Venkata Ramana ...**Plaintiff**
And
Bukya Vijayamma and others ...**Defendants**

Notice Defendant No:6 & 7

D6: Korra Sakunthala W/o B.Sreeramulu D/o Late Korra Sreerama Murthy, R/of D.No:13-886, Madanapalli, Annamayya Dist.
D7: Korra Siva Ranjani w/o Chalapathi D/o Late Korra Sreerama Murthy, R/of D.No:11-236, Madanapalli, Annamayya Dist.

పై నెంబరు కేసులో ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తం 27/11/2023 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

(By order of the court)
B.NALLA REDDY
Advocate , Anantapuramu,
Cell:7702983833

రైతు బజార్‌కు భూమిపూజ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఎంపీ,ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న సర్పంచ్ ఆర్‌వి.విరమణ

మండలంలోని రాఘవరాజుపురంలో నూతనంగా నిర్మించబోయే రైతు బజార్ నిర్మాణానికి రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు భూమిపూజ చేశారు. అనంతరం వైసిపి కార్యాలయంలో నూతనంగా నియమితులైన అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు, సహాయకులకు నియామక పత్రాలను అందించారు. కార్య క్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, వైస్‌ఎంపిపి ధ్వజారెడ్డి, వైసిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ హేమనవర్మ, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, ఎస్‌ఎ.సలాం, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, జిల్లాటూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, ఉప సర్పంచ్ శివసాయి, జడ్‌పిటిసి రత్నమ్మ, సిడిపిఒ సౌభాగ్యమ్మ, సర్పంచ్ ఆర్.వి.రమణ, పాల్గొన్నారు.

నూతన మార్కెట్ గదులు ప్రారంభం

పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో రూ.15లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఆరు అదనపు గదులను ఎంపీ పి.వి.మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ప్రారంభించారు. ఎంపీ, ఎమ్మెల్యేలకు ఉప సర్పంచ్ తోటశివసాయి పూల మాలలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ ముప్పాళ్ళ హేమన్‌వర్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ ముజీబ్, భుజంగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ పోకల సుబ్బరాయుడు, మందల నాగేంద్ర, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జడ్‌పిటిసి రత్నమ్మ, సర్పంచ్ శివయ్య, ఉపసర్పంచ్ తోట శివసాయి, పంచాయతీ ఇఒ డి.ప్రసాద్‌రావు, మాజీ జడ్‌పిటిసి సభ్యులు రాజేశ్వరి, ఎంపిటిసి మహేశ్వర్ రెడ్డి, పుష్పలతలు పాల్గొన్నారు.

టిడిపి మినీ మేనిఫెస్టోతో అన్నివర్గాలకు మేలు

ఇంటింటి ప్రచారంలో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు చేసేలా టిడిపి మినీఫెస్టోను రూపొందిం చారని మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇంచార్జి దొమ్మలపాటి రమేష్ పేర్కొన్నారు.శుక్రవారం ఇం టింటి ప్రచారాన్ని నిర్వహించి మిని మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి విడత టిడిపి ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అవినీతి అరాచకాలను, ధరల పెరుగుదలను, విద్యుత్ చార్జీలు, బస్సు చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదలను వివరిస్తూ ప్రజలను చైతన్యవంతులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చలపతి నాయుడు, యువ నాయకులు దొమ్మలపాటి యశశ్వి రాజ్, పట్టణ అధ్యక్షులు భవాని ప్రసాద్, మండల అధ్యక్షులు శ్రీని వాసులు, క్లస్టర్ ఇన్‌ఛార్జి మేకల రెడ్డిశేఖర్, రామ్మోహన్‌రాజు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించాలి : డిఇఒ

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి :ఎస్ఇఎఎస్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డిఇఒ శ్రీరాం పురుషోత్తం

విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యం పెంచడానికి స్టేట్ ఎడ్యుకేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే పరీక్షను నిర్వహిస్తున్నామని డిఇఒ శ్రీరాం పురుషోత్తం తెలిపారు. శుక్రవారం ఆయన కలికిరి ప్రభుత్వ పాఠశాలలో తనిఖీ నిర్వ హించారు. ఎస్‌సిఇఆర్‌టి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్టేట్ ఎడ్యుకేషనల్ ఎచీవ్ మెంట్‌సర్వే-2023 ప్రకారం విద్యార్థులలో ఉన్న అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు శుక్రవారం ఉదయం పాఠశాలలో పరీక్షలు నిర్వహించామని, ఈ సర్వే పరీక్షలను తెలుగు, ఇంగ్లీష్, గణితం పరిజ్ఞానంపై ఒఎంఆర్ షీట్స్ ద్వారా పాఠశాలలోని 3, 6, 9 తరగతులకు ఆంగ్లం, తెలుగు మరియు ఉర్దూ మాధ్యమాలలో 26 పాఠశాలలోని 918 మందికి పరీక్షలను నిర్వహించామన్నారు. ఈ పరీక్షల ఫలితాల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలు, అభ్యసన అంతరాలను గుర్తించడం జరుగుతుం దన్నారు. దీనివలన బోధన అభ్యసనాల్లో లోపాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టేం దుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎంపిపిఎస్ బొమ్మలవారిపల్లి పాఠశాలలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయలతో అకడమిక్ అంశాల పై సమీక్షించి సూచనలు చేశారు. విద్యార్థులకు చదువు పట్ల అంకితభావంతో చదవాలని, తద్వారా వారి తల్లితండ్రులకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ-1 కరీముల్లా, ప్రధానోపాధ్యాయులు శారద, సరిత, సిఆర్‌ఎంటి సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.**గాలివీడు :** దేశవ్యాప్తంగా జాతీ య సాధన సర్వేలో భాగంగా విద్యార్థుల నైపుణ్యాన్ని గుర్తిం చేందుకు శుక్రవారం మండల కేంద్రంలో 27 పాఠశాలలలో జాతీయ సాధన సర్వే పరీక్ష నిర్వ హించారు. ఈ పరీక్షకు మండలంలోని 3, 6, 9వ తరగ తుల విద్యార్థులు 964 మంది హాజరైనట్లు ఎంఇఒ పిల్లి నాగరాజు తెలిపారు. విద్యార్థులు పరీక్ష రాసేందుకు అవసరమైన వసతులను కల్పించామని తెలిపారు.**పీలేరు:** కేంద్ర విద్యా శాఖ పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ ఎస్ఇఎఎస్ కార్యక్రమాన్ని నిర్వహించింది.పభుత్వం సూచించిన పాఠశాలల్లో 3, 6,9 తరగతుల విద్యార్థుల సామర్థ్య సాధనాలను తెలుసుకోవడానికి ప్రతిపా దించిన సర్వేలో భాగంగా మండలంలో ఎన్నిక కాబడిన 8 ఉన్నత పాఠశాలు, 4 ప్రాథమిక పాఠశాలలు, 3 గురుకుల పాఠశాలు, 12 ప్రైవేట్ పాఠశాలలు కలిపి మొత్తం 27 పాఠశాలల్లోని 3,6,9 తరగతులకు చెందిన విద్యార్థులకు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించడం జరిగింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థులు ఫీల్డ్ ఇన్విజిలేటర్లుగా, పీలేరు మండల విద్యాశాఖాధికారులు వై.లోకేశ్వర్ రెడ్డి, బి.పద్మావతమ్మ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజి నటరాజన్ పరిశీలకులుగా వ్యవహరించారు. ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం పకడ్బందీగా పరీక్షలు నిర్వహించారు. జవాబు పత్రాల బండల్స్‌ను ఫీల్డ్ ఇన్విజిలేటర్లు సాయంత్రం 5గంటలకు ఎంఇఒ కార్యాలయంలో చేర్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సి.ఆర్.పిలు, మురళీధర్ రాజు, నాగరాజ, అశోక్, మాధవి, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

బీమా పాలసీలపై అవగాహన ఉండాలి

మాట్లాడుతున్న ఆర్‌బిఒ జయరాంరాజు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక ఎస్‌బిఐ బ్రాంచ్ కార్యాలయంలో శుక్రవారం ఖాతాదారులకు బీమా పాలసీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్‌బిఒ జయరాంరాజు ప్రభుత్వం అమలు పరుస్తున్న ప్రధానమంత్రి జీవనజ్యోతి, బీమాయోజన, సురక్ష బీమా, యోజన పాలసీల గురించి వివరించారు. ఎస్‌బిఐ బ్యాంక్ ఖాతాదారులు ప్రధానమంత్రి జీవనజ్యోతి, బీమా యోజన పాలసీని 18 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల వయసు కలిగిన వారు మాత్రమే రూపాయలు 436 రూపాయలు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ పాలసీ ద్వారా రెండు లక్షలు బీమా పొందవచ్చని అన్నారు. సురక్ష బీమా యోధన పాలసీ ద్వారా 18 సంవత్సరాల నుంచి 70 సంవత్సరాల వయసు కలిగిన ఖాతాదారులకు తీసుకోవచ్చునన్నారు. ఈ పాలసీలో కేవలం ఇరవై రూపాయలు పాలసీ ప్రీమియం చెల్లించాలన్నారు. ప్రమాదానికి గురైన వారికి రెండు లక్షలు ప్రమాద బీమా పొందవచ్చునన్నారు. ఈ సదస్సులో ఎస్‌బిఐ మేనేజర్ చంద్రశేఖర్, బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన నక్షత్ర

ప్రజాశక్తి-నందలూరు

విద్యార్థి నక్షత్రను అభినందిస్తున్న హెచ్‌ఎం మాధవీలత

రాయచోటి పట్టణ పరిధిలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఈనెల 2న ఎస్‌జిఎఫ్ అండర్-14 బాలికల విభాగంలో మండలంలోని పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థిని నక్షత్ర విశేష ప్రతిభను ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవిలత తెలిపారు. ఈ సంద ర్భంగా శుక్రవారం ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ నవంబర్ 9,10,11, వ తేదీలలో విశాఖజిల్లా పరిధిలోని అరకు నియోజకవర్గంలో జరగనున్న రాష్ట్రస్థాయి వాలీ బాల్ పోటీ లలో తమ విద్యార్థిని పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఫిజికల్ డైరెక్టర్ సుస్మిత, పిఇటి జగన్, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

పిఎంఇజిపి ద్వారా రైతులకు పశురుణాలు

సమావేశంలో మాట్లాడుతున్న గుణశేఖర్ పిళ్లై

ప్రజాశక్తి-పీలేరు

ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా పశు రుణాలు ఇవ్వనున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ సంచాలకులు గుణశేఖర్ పిళ్ళై తెలిపారు. పీలేరు నియోజకవర్గంలోని పశుసంవర్ధక శాఖ అధికారులు పశు వైద్యులకు శుక్రవారం సాయంత్రం పీలేరు పశువైద్యశాలలో పిఎంఇజిపిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి ఆవులు కొనుగోలు చేసేందుకు పిఎంఇజిపి ద్వారా 35 శాతం సబ్సిడీ అందుబాటులో ఉందని, ఒక్కొక్క రైతు రెండు నుంచి నాలుగు ఆవులు కొనుగోలు చేసుకోవచ్చని చెప్పారు. యూనిట్ ధర లక్ష నుంచి రెండు లక్షల వరకు ఉంటుందని యూనిట్ ధరలో 35 శాతం కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ పోను మిగిలిన 65 శాతంలో 10 శాతం లబ్ధిదారుడు భరించాలని మిగిలిన 55 శాతానికి బ్యాంకు రుణం పొందవచ్చన్నారు. ఎల్‌డిఎం వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పాడి ఆవులు కలిగిన రైతులకు మేత కొనుగోలు గడ్డి పెంపకం కోసం పశు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా విరివిగా రుణాలు అందించనున్నట్లు తెలిపారు. పీలేరు, వాల్మీకిపురం, కెవిపల్లె, కలకడ మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిందని, ఆ మండలాల్లో ఈ పథకం పెద్ద ఎత్తున చేపట్టేందుకు పశుసంవర్ధక శాఖ సిబ్బంది సహకరించాలని తెలిపారు. అనంతరం ఆయన పశు కిసాన్ క్రెడిట్ కార్డులకు సంబంధించిన దరఖాస్తులు బ్యాంకులకు అందించాల్సిన పత్రాల గురించి వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిడి మాలకొండయ్య, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బోధి షావలి, ఎడి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

దాతలు ముందుకు రావడం హర్షణీయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రామాపురం

దేవాలయాలు నిర్మించడానికి దాతలు ముందుకు రావడం హర్షణీయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన రామాపురంలో జడ్‌పిటిసి మాసన వెంకటరమణ ఇంటి వద్ద సీతారామ లక్ష్మణ దేవాలయం శివాలయానికి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ఆధ్యాత్మికత పెంపొందించడానికి దేవాలయ నిర్మాణాలకు నాయకులు, ప్రజలు, ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ విశ్వనాథరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రమేష్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి, ఎంపిటిసి వెంకట సుబ్బారెడ్డిలు పాల్గొన్నారు.

4 నుంచి ఓటర్ల జాబితా పరిశీలన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఈ నెల 4,5 తేదీలలో మండల ఓటరు జాబితాపై స్పెషల్ కాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ రఫీక్‌అహ్మద్ పేర్కొన్నారు. ఓటర్లకు సంబంధిత పోలింగ్ బూత్ ల వద్ద బిఎల్ఒలు అందుబాటులో ఉంటారన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద డ్రాఫ్ట్ ఎలెక్టోరల్ కాపీ, బిఎల్ఒ రిజిస్టరు, ఖాళీ క్లెయిమ్‌ఫామ్‌తో పాటు ఉదయం10 గంటల నుంచి సాయం త్రం 5 గంటల వరకు ఉండి ఓటర్ల జాబితాపై విచారణ చేస్తారని తెలిపారు. కొత్త ఓటర్ల నుంచి ఫారం-6, చనిపోయిన వారి బంధువుల నుంచి ఫారం-7, ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరొక పోలింగ్ కేంద్రానికి మార్పులు, ఫారం-8 ఎంపిక చేసుకుంటారన్నారు. మండల, పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టిడిపి కార్యకర్తలకు సంఘీభావం తెలుపుతున్న సురేంద్రయాదవ్

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆపదలో ఉన్న కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని టిడిపి రాజంపేట పార్లమెంట్ బిసిసెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్ పేర్కొన్నారు. పుంగనూరు అల్లర్లలో అధికార పార్టీ పెట్టిన అక్రమ కేసులలో భాగంగా మదనపల్లి సబ్‌జైలులో ఉన్న టిడిపి కార్యకర్తలు వెంకటేష్ యాదవ్, యర్రం నాయుడు, మంజునాథ్ నాయుడు, షామీర్, చెన్నకేశవులకు బెయిలు మంజూరు కావడంతో జైలు నుంచి విడుదలయ్యారు. రాజంపేట పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్ సబ్ జైలు వద్దకు చేరుకుని వారికి సంఘీభావం తెలిపి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా సురేంద్ర యాదవ్ మాట్లాడుతూ అధికార పార్టీ ఎన్ని అక్రమ కేసులు బనాయించినా కార్యకర్తలు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. న్యాయ వ్యవస్థపై టిడిపి నాయకులకు అపారమైన నమ్మకం ఉందన్నారు. అక్రమ కేసుల్లో శిక్షణ అనుభవిస్తున్న పార్టీ కార్యకర్తలందరికీ త్వరలోనే బెయిల్ వస్తుందని ధీమా చేశారు. అధికార వైసిపి ఎన్ని ఇబ్బందులు పెట్టినప్పటికీ ఎదురొడ్డి నిలబడాలని, ఆ పార్టీని గద్దెదించే అంత వరకు పోరాటం కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభాకర్, బావజాన్, మోహన్ రెడ్డి, రాజారెడ్డి, సత్య యాదవ్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నష్టపోతున్న రైతులను ఆదుకోవాలి

ఖాజీపేట : ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, ఆరుతడి పంటలకు కూడా సాగునీరు అందకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని, ఎండిపోయిన పంటలను గుర్తించి రైతులకు నష్టపరిహారం అందించాలని టిడిపి మండల నాయకులు, కడప మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ తవ్వారు పల్లె సందుల నాగశివారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కెసి కాలువలకు ఆరుతడి పంటల సాగునీరు అందిస్తామని అధికారులు ప్రకటనలు చేసినా సాగునీరు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. కెసి కాలువకు సాగునీరు అందించి ఆరుతడి పంటలకు కింద జొన్న, మినుము పంటలు ఎండిపోకుండా చూడాలని పేర్కొన్నారు. నష్టపో యిన రైతులకు పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ అందించి రైతులను ఆదుకో వాలన్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల రైతుల పరిస్థితి ఆగమ్య గోచరంగా ఉందని, విద్యుత్ సరఫరా సమస్యల వల్ల కూడా పంటలు ఎండి పోతున్నాయని అధికారులు, ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు.

డ్రైడేను క్రమం తప్పక పాటించాలి

చాపాడు : డ్రైడేను క్రమం తప్పకుండా పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ల్యాబ్, ఫార్మసీ లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం చాపాడు గ్రామంలో డ్రైడే- ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా మురుగు గుంటలను, ప్రతి ఇంటిలోని తొట్లు, పాత టైర్లు ఇతర సామగ్రిని పరిశీలించారు. మురుగు నీరు నిల్వ ఉంటే లార్వా ఉత్పత్తి చెంది దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. ప్రజలకు జబ్బులు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక వైద్య సిబ్బందికి సూచనలు సలహాలు అందజేశారు.

క్రైం కార్నర్

ఆగస్తీశ్వర ఆలయంలో చోరీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

చోరీకి గురైన ఆగస్తీశ్వర ఆలయం

పట్టణ శివారులోని గుండ్లూరు అగస్తీశ్వర ఆలయంలో శుక్రవారం తెల్లవారు జామున గుర్తుతెలియని ఆగంతకులు చోరీ పాల్పడి అమ్మవారి విగ్రహం, నగలు, రెండు హుండీలు, శఠగోపం దోచుకెళ్లారని పోలీసులు తెలి పారు. అడ్డుకోబోయిన వెంకటేశ్వర్లు అనే వృద్ధుడిపై కత్తులు తుపాకులతో బెది రించి రాయితో దాడి చేయడంతో తీవ్రంగా గాయ పరిచారని అన్నారు. రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చిన ముగ్గురు ఆగంతకులు తెలుగు, ఉర్దూ భాషలలో మాట్లాడుతున్నట్లు బాధితుడు నారాయణ తెలిపారని అన్నారు. సిసి కెమెరాలు ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారని తెలిపారు. ఘటనపై ఆలయ పూజారి శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు రూరల్‌పోలీసు తెలిపారు.

కోడిపందెం రాయుళ్లపై కేసు నమోదు

ప్రజాశక్తి-రామసముద్రం

కోడిపందెం స్థావరాలపై దాడులు చేసి ఐదు మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే మండలంలోని పెద్ద కురప్పల్లి పంచాయతిలోని నారేవారిపల్లి గ్రామ సమీపంలోని అడ్డకొండ ప్రాంతంలో కొందరు వ్యక్తులు కోడిపందేలు అడుతున్నట్లు సమాచారం రావడంతో కోడి పందే స్థావరాలపై దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో కొందరు వ్యక్తులు తప్పించుకొని పారిపోయారని, ఐదుగురు పట్టుబడ్డారని తెలిపారు. వారితో పాటు రెండు కోడిపుంజులు, రూ. 4830 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.